# చెలిమి నీడ

చీకటి తనంత తాను బాధించక పోయినా తన చాటున అనేక దురంతాలకు అవకాశం ఇస్తుంది అందుకే ఏ వయసులోనైనా చీకటిని ద్వేషిస్తాడు మానవుడు

కాని నాకు చీకటి భగవంతుడు ప్రసాదించిన వరం నిరాటంకంగా నా వృత్తి చేసుకోగల ధైర్యం నాకు చీకటే ప్రసాదిస్తుంది

రైలు ఏ దూర తీరాలు చేరేందుకో ఆ చీకట్లో స్పీడుగా పరిగెడుతోంది కొండలు, బండరాళ్ళు, చెట్లు వేటినీ లెక్క చేయడం లేదు రైలు

నాలాంటి బండరాయికి ఆ రైలు, ఇలాంటి కంపార్టుమెంటులు, ఉయ్యాల్లోని పసిపాపల్లా నిద్రపోతున్న జనం కొత్త కాదు తెల్లారేసరికి వీళ్లలో కొందరు జేబులు కత్తిరించబడి లబో దిబో మంటారు. మరికొందరు పోయిన సామానులను గమనించి బావురు మంటారు

చకచకా ఆ చీకట్లో. నా పని చేసుకు పోదామనుకుంటే కాస్త నిరాశ ఎదురయ్యింది ఈ మధ్య రైళ్లలో దొంగతనాల గురించి పేపర్లలో చదివి జనం చాల తెలివి మీరి పోతున్నారన్న మాట.

నా చెయ్యి నా ఎదుటి బెర్తు మీదనున్న వ్యక్తి లాలూచు చొక్కా జేబు వైపుకు పోతూ అప్రయత్నంగా వణికింది కాని అతని దగ్గర తప్పకుండా ఆరు వందలైనా దొరుకుతాయని తెలుసు- ఎందుకంటే-

నా అందమైన రూపాన్ని చూసి దొంగ అని తెలుసుకోలేక అతమా భ్రమలో పడ్డాడు పైగా ఇరవై గంటలుగా కలసి చేస్తున్న ప్రయాణంలో ఆప్త మిత్రుడయ్యాడు అన్నదమ్ముడిలా తన భోజనం పంచి ఇచ్చాడు అరమరిక లేకుండా కష్టసుఖాలు చెప్పుకున్నాడు

"మనిషి దూరమైన తర్వాతే మమతలు తెలిసేవి అంతవరకు దాచుకున్న మనసులోని ప్రేమ అభిమానాలు ఆ వ్యక్తులు దూరమయ్యాకే తెలుస్తాయి అలనాటి సంఘటనలన్నీ ఒక్కొక్కటీ గుర్తుకొచ్చి ఆ వ్యక్తి విలువను తెలియ జేస్తాయి. అయినా తీవ్రంగా బాధపడ్డం తప్ప ఏం చెయ్యలేం అశ్వత్థామా! నా తమ్ముడు బ్రతికుంటే నీలాగే ఉండేవాడేమో! ఎందుకో నిన్ను చూస్తే చిన్నప్పుడు తప్పిపోయిన నా తమ్ముడు గుర్తుకొస్తున్నాడు పోనీ ఇపుడు మాత్రమేం మనది అందరిలాంటి స్నేహం కాకూడదు కోటి దివ్యవీణల సంగీతం, మంజీరనాదం కావాలి నాకు కాస్త భావుకత ఎక్కువ- ఏమనుకోకు."

మళ్లీ కాసేపట్లోనే అన్నాడు- "నీకెందుకు అబద్ధం చెప్పాలి. మా తమ్ముడిని మా నాన్న ద్రోహం చేసాడు. కన్నతండ్రి కనుక అయన్ను నేను అప్పట్లో తప్పు పట్టలేక పోయినా నా మనసెందుకో వాడిని చూడాలని పదేపదే కోరుకుంటోంది అశ్వత్థామా! వాడిని వెతకడానికే బయలు దేరిన నేను నిరాశతో తిరిగి వస్తున్నాను. ఏదో సినిమాలో లాగ నువ్వే నా తమ్ముడివి అయితే ఎంత బాగుండును. మా నాన్న చేసిన పాపాన్ని కన్నీటితో కడిగేద్దును'.

నలభయ్యేళ్ల వ్యక్తి అలా చంటి పిల్లాడిలా కళ్ల నీళ్లు పెట్టుకుంటుంటే తనకూ కంటినీరు సుడులు తిరగ బోయి ఆగిపోయింది కాదు- నేనే ఆపేసాను ఛ! ఇలాంటి సెంటిమెంట్లకి లొంగకూడదు అతను నిద్రపోగానే డబ్బు చేజిక్కించుకుని దిగిపోవాలి ప్రస్తుతం చేతిలో డబ్బులులేని నాకు తన గమ్యం చేరేంతలో ఎంతైనా డబ్బు అవసరం

అసలు ఆ ఊళ్లో ఎంతకాలం ఉండాల్సి వస్తుందో- ముసలాయన చావు- హృదయ విదారకమైన చావు కళ్లారా చూడాలి

ఆలోచనల్లోపడ నా చెయ్యి అతని జేబుకు బదులు చెంపను తాకింది వెంటనే కరెంటు షాక్ కొట్టినట్లు చెయ్యి లాక్కున్నాను కారణం?-

మంచుకంటి చల్లగా ఉంది అతని చెంప- కొంపదీసి బాల్చీ తన్నేయ లేదుకదా! అప్రయత్నంగా నా చెయ్యి అతని చేతిని తాకింది నా ఆలోచన నిజమే-

అతను చచ్చిపోయాడు.

మైగాడ్! అంటే హార్ట్ ఎటాక్‌తో పోయి వుంటాడు ఇందాక కాస్త నొప్పిగా ఉందని ఏదో మాత్ర వేసుకున్నాడు

ఇప్పుడెలా?

ఛ! ఏమిటి నేను ఆలోచిస్తున్నాను? అతనేమైతే నాకెందుకు? తనకి కావలసింది డబ్బు-

కానీ శవం జేబులో డబ్బు దొంగిలించడం-?

తనలో మానవత్వం పూర్తిగా తుడిచి పెట్టుకు పోయిందా? అవును- మరయితే ఈ కలవరం దేనికి?

'అద్దం లాంటిది నీ మనసు తమ్ముడూ! ఎంత నిర్మలమైనదో అంత సున్నిత మైనది కూడ నీ మనస్సు ఎందుకో ముక్కలయిందన్న సత్యం నీ ముఖమే చెప్తోంది నీ కళ్లలో ఏదో 'నిర్లిప్తత, పోగొట్టుకున్నానన్న 'ఆవేదన, దేనినో పొందలేక పోయానన్న తపన కనిపిస్తున్నాయి నాకు చెప్పకూడదా!"

ముక్కు మొహం తెలియని ఈ వ్యక్తి మాటలెందుకిలా వెంటాడు తున్నాయి స్నేహమా?- ఛ!- స్నేహమనేది ఈ ప్రపంచంలో స్వార్థానికి ఒక ముసుగు మాత్రమేనని లోకం నేర్పిన అనుభవాల పాఠాల నెలా మర్చిపోను-

నా మనసును రాతికంటే కఠినం చేసుకున్నాను అలవాటుగానే.

చకచకా నా పని పూర్తయింది. అతని జేబులో చాల డబ్బే వుంది. అతని ఆచూకీ తెలిపే కాగితాలు చింపి రైల్లోంచి విసిరేసాను.

అదృష్టవశాత్తు నేను దిగాలనుకుంటున్నది పక్క స్టేషనే- రైలాగగానే ఒక్క క్షణం ఆలస్యం చెయ్యలేదు

నడుస్తున్నా ఆలోచన అతని దగ్గరకి వెళ్లి ఆగుతోంది. బలవంతాన- తెలియని ఆ ఊళ్లో- చీకట్లో నడుస్తూ అతని ఆలోచన తప్పించాలని నా జీవితం వైపు మళ్లించాను

* * * *

గాలివాటు బ్రతుకు నాది ఎందుకు బ్రతుకుతున్నానో ఎవరికోసమో. తెలియదు బ్రతకాలి అంతే-

తెల్లవారుతుంది- పగలు సాగుతుంది- సంధ్య అలముకుంటుంది చీకటి కబళిస్తుంది- ఆ రోజుకి నా జీవన భృతి దొరుకుతుంది

దూరంగా ఏరు ప్రవహిస్తుంది చెట్లమీద పక్షులు ఎగురుతాయి- మళ్లీ గూడు చేరుకుంటాయి- నాకో గూడు లేదు పువ్వులు పరిమళిస్తాయి- వాడిపోతాయి- అవే దృశ్యాలు నూతన స్పందన లేదు- బావురుమనే ఒంటరితనం- ప్రగాఢ నిశ్శబ్దం!

జీవితం మీద సమాజం మీద తోటి మనుషుల మీద ఏదో చెప్పలేని కక్ష, వ్యక్తం చెయ్యలేని కసి బహిర్గతం చెయ్యలేని ద్వేషం నాలో ప్రబలి పోయాయి ఆ రోజు- నా దృష్టి మళ్లీ దినపత్రికలోని ప్రకటన మీదకి మళ్లింది.

"నాయనా సుధీర్! నువ్వెక్కడున్నావో తెలియక ఈ ప్రకటన ఇస్తున్నాను తమ్ముడి పిల్లల్ని ద్రోహం చేసినందుకు చెట్టంత ఎదిగిన ఇద్దరు కొడుకుల్ని పోగొట్టుకున్నాను అవసాన దశలో నీ ఆస్థి నీకు అప్పగించాలనీ, నిన్ను కళ్లారా చూసి క్షమాభిక్ష కోరాలనీ తపించి పోతున్నాను పెదనాన్నని క్షమించి ఎక్కడున్నారా

ఇట్లు

సంతకం చేసేచోట ఆ పేరు చూసి నా కళ్లు ఎఱ్ఱబడ్డాయి నా పిడికిళ్లు బిగుసుకున్నాయి- పెద్దనాన్నట-

ఈ ప్రేమ చిన్నప్పుడు తల్లిదండ్రు లిద్దర్నీ ఏక్సిడెంట్‌లో పోగొట్టుకుని అనాథల్లా మిగిలిన పసివాళ్లపై ఎందుకు కలగలేదు? అనాడే చెల్లాయికి తనకి పెత్తండ్రి నీడ దొరికితే తమ బ్రతుకులింత దుర్భరంగా తయారయ్యేవా?

నా కళ్ల నుంచి బాధతోనో కోపంతోనో నీళ్లు కారిపోతున్నాయి.

మందులులేక దిక్కులేని చావు చచ్చిపోయిన




చెల్లాయి జ్ఞాపకంతో - ప్రకటన చూడగానే ఏకాకిగా మిగిలిపోయిన నాలో మొదట కలిగిన సానుభూతి తుడిచిపెట్టుకు పోయింది.

మనుషుల మధ్య ఆత్మీయత, అనురాగం, ప్రేమ ఎక్కువగా పెంచుకోకూడదు ఆ లతలు పెరిగి పెద్దవైన తర్వాత తెంచుకుని బాధపడేకంటే మొక్కగా ఉన్నప్పుడు తుంచేస్తేనే మంచిది

ఈ నగ్నసత్యం చిన్నప్పుడే నాకు పాఠం నేర్పింది.

ప్రతీ తల్లిలాగే నా తల్లికూడ నేను అందరికన్నా అతీతంగా ఏదో గొప్పవాడయి పోవాలని భగవంతుని సన్నిధిని ఉదయ సంధ్యల్లో కోరుకుంది కాని అదృష్టం అడ్డదారులు పట్టి ఆర్థిక సమస్యలు అడ్డు తగిలి ఈనాడొక దొంగగా మారాను

[illegible] తీర్చాలని కాయకష్టం చేసి అయినా చదువుకోవాలని అనుకుంటే-

పొంగిపొరలే స్వార్థంతో తడిసిన విద్యావృక్షం- పేద పిల్లలకి ప్రభుత్వం ఇచ్చే నిధుల్ని స్వాహా చేసే- అధికార్ల - పాట్లు - అసహ్యం కలిగింది

[illegible] పాఠంతటికీ లోకువ అని ఆకలితో నీరసపు చూపులు చూసే నా మీద చెయ్యని

దొంగతనాన్ని ఆరోపించింది లోకం- ఆ ముద్ర ఎందుకో స్థిరపడి పోయింది

చెయ్యని నేరానికి లోకం విధించిన శిక్ష నుంచి ఏ భగవంతుడూ కాపాడలేక పోయాడు. విధిచేత, సంఘం చేత, తల్లిదండ్రుల చేత వంచితుడైన అభాగ్యుడిగా మిగిలిపోయాను

ఎన్నో అవమానాల నెదుర్కొని చివరికి మొండివాడిగా రాటు తేలాను.

పచ్చి దొంగనయినా ఈ రోజు సంఘంలో నేనొక గౌరవప్రదమైన వ్యక్తిని అందమైన నా రూపం అంత త్వరగా పట్టివ్వదు.

నేరస్థులను పట్టుకునే పోలీసులు నా మిత్రులు

లేత వయసులో అందరి ప్రవర్తన నాలో ఎలాంటి విషబీజాలు నాటిందో ఒక్కో సమయంలో క్రోధం పట్టలేక ఒంటరిగా ఏడ్చేవాడిని అనాడు నా చుట్టూ నేనొక వలయం గీసుకున్నాను ఆ పరిధిని దాటి నా సమీపాని కెవరూ రాకూడదని నాలో కఠోరమైన పగతో కూడిన నిర్ణయం జ్వలిస్తూండేది

ఈనాడిలా అన్నిటినీ త్రోసి నిబ్బరంగా గర్వంగా తిరగ్గలుగు తున్నానంటే ఆత్మవిశ్వాసమే కారణం అందరికంటె ఉన్నతుడిని అన్న అహాన్ని పెంచుకో బట్టే పెరిగి పెద్దవాడి నయాను లేదా చిన్నపుడే ఏ మురిక్కాలవ పక్కనో నాశవాన్ని కుక్కలు పీక్కుతినేవి

రోడ్డుమీద కుక్కల అరుపులతో వాస్తవంలోకి వచ్చాను. ఊరకుక్కలు తీవ్రంగా పోట్లాడు కుంటున్నాయి మనుషుల్లాగే వాటికీ పడదో ఏమో ఆ నల్లకుక్క. మచ్చలకుక్క ఎప్పుడూ పోట్లాడు కుంటూనే వుంటాయి బలవంతుల రాజ్యంలా- కాస్త పెద్దదయిన నల్లకుక్క- మచ్చల కుక్కని కరిచి పారిపోయింది. కుయ్యోమంటూ కూలబడి పోయింది మచ్చల కుక్క

గాలికి ప్రకటన ఉన్న దినపత్రిక రెపరెపలాడు తోంది నవ్వొచ్చింది నాకు

మనిషి ఎంత వెర్రివాడో – సత్తువ ఉన్నంత కాలం తనంతవాడు లేడని విర్రవీగుతాడు. కూడా పట్టుకుపోయే వాడిలా లక్షలు సంపాదిస్తాడు అనుభవించే వంశాకురం మిగలకపోతే నరక బాధ-

## రాత్రిలో నీరు

అందుకే- సరిగ్గా అందుకే ముసలాయన ప్రకటన ఇచ్చాడు

కొందరికి తమని ప్రేమించే వ్యక్తులుంటే తప్ప బ్రతకలేని మానసిక దౌర్బల్యం ఆ దౌర్బల్యం అతనికి తెలియకుండానే అతన్ని వశపరచు కుంటుంది ఆ బలహీనతను జయించే శక్తి కోల్పోయినపుడే పాతకక్షలు, ఆత్మాభిమానాలు పోయి ఆత్మీయుల కోసం ఆరాటం

మనిషి బ్రతకడానికి కావలసింది సుఖమొక్కటే కాదు సంతోషం కూడ. సుఖాలను డబ్బుతో కొనుక్కోవచ్చు కాని సంతోషం మానసికమైనది.

ముసలాయన నాకు చేసిన ద్రోహానికి- ఈ రోజు నేను దొంగగా బ్రతకడానికి కారణమైన ఆ వ్యక్తిని మానసికంగా ఇంకా చిత్రవధ చెయ్యాలి.

ఆవేశంగా లెటర్ వ్రాసి ప్రకటనలోని అడ్రసుకు పోస్ట్ చేసాను.

"నీ ప్రకటన చూసాను నీ డబ్బు నా కక్కర లేదు '– ఇదీ సారాంశం.

అది ఎవరో వ్రాసారనుకోడానికి వీల్లేకుండా తన తమ్ముడి కొడుకునే అని గుర్తించేందుకు వీలుగా కొన్ని సంఘటనలు వ్రాసాను సుధీర్ని- అశ్వత్థామగా ఎలా మారానో మాత్రం వ్రాయలేదు

ఆ మనిషి ఎలా గిలగిల్లాడతాడో చూడాలనే కాంక్ష నాలో ప్రబలి పోయింది

ఎంత డబ్బు హోదావున్నా ఎన్ని పదవులు పేర్లు ఉన్నా మనిషి తహతహలాడేది ప్రేమకోసమే గాలి వెలుతురు మనిషి శారీరకారోగ్యానికి ఎంత అవసరమో 'ప్రేమ" మానసికారోగ్యాని కంత అవసరం ప్రేమ సానుభూతి లేనినాడు మనిషి నాలా దానవుడన్నా అవుతాడు. యంత్రంలాగైనా మారిపోతాడు

ఆ మనుషులు- ఆ వూరు- ఆ యిల్లు నేను గుర్తుపట్ట గలనా? కుతూహలం నా చేతిలో డబ్బులేక పోయినా నన్ను పరిగెత్తించింది అయితే ఆ రైలు ప్రయాణం నన్నొక పెద్ద పరీక్షలో పడవేస్తుందని ఊహించ లేదు.

* * * * * * * * * *

జల్లు పడుతోంది- మళ్లీ నా ప్రయత్నం లేకుండానే ఆలోచనలు రైల్లో పరిచయమైన వ్యక్తి వైపు మళ్లాయి

ఈ పాటికి రైలు ప్రక్కస్టేషన్ చేరుకుంటుంది ఎవరో అతడు చచ్చిపోయాడని గుర్తించి రైల్వే పోలీసులకి తెలియ జేస్తారు నా మీద అనుమానమే రాదు ఎవరికీ- తన స్టేషన్ రాగానే దిగిపోయాడను కుంటారు

ఎవరూ అతడెవరైందీ గుర్తించలేక పోతే రైల్వేవాళ్లే అతని శరీరాన్ని ఏ వేగన్లోనో పడేసి దిక్కులేని శవంలా నా బుఱ్ఱ తిరిగి పోతోంది

"తమ్ముడూ!"– ఎప్పుడో తప్పిపోయిన తమ్ముడి కోసం ఇప్పటికీ వెతుకుతున్న అతని దీనమైన మొహం కళ్లముందు కదలాడింది

ఛ – తను చలించకూడదు

ఈసారి అంతరాత్మ మనసు పీక నొక్కేసింది

"ఎందుకు చలించకూడదు- నువ్వు మనిషివి కావా? నోరులేని మూగజీవం కుక్కపాటి కూడ చెయ్యవా???" కళ్లముందు- ఒళ్ళు జలదరించే లాంటి దృశ్యం- ఆ కుక్క ఏ లారీ క్రిందో పడి పచ్చడై పోయివుంటుంది. నేను బయలుదేరిన ముందు రాత్రి-

ఎప్పుడు మచ్చలకుక్కతో పోట్లాడి గెలిచే నల్ల కుక్క ఆ మాంసం ముద్ద చుట్టూ తిరుగుతూ- గుండెలవిసేలా మొరుగుతూ- కాకులు ఆ మాంసం ముద్దని పీక్కుతినకుండా కాపలా కాస్తూ- అతికష్టంమీద భీభత్సంగా ఉన్న ఆ మాంసం ముద్దని పెంటకుప్ప వరకు ఈడ్చుకొచ్చి- చెత్తతో కప్పేసింది- ఒక రోజంతా తిండి తిప్పలు లేకుండా అక్కడే కన్నీళ్ళు కారుస్తూ కూర్చుంది

ఎవరైనా చెప్తే నేను నమ్మేవాడిని కాను- ఆ రోజు తనని ఏమాత్రం కదిలించని ఆ దృశ్యం . అతను కూడ.

బాప్రే- అతనికి అలా కాకూడదు- రక్తం పంచుకు పుట్టకపోయినా అనుభూతులు పంచుకున్న అతడు తన సోదరుడే. శిలలాంటి నా మనసు మైనంలా కరుగుతోంది

నేనీ వూరు ఎందుకొచ్చాను? ఎపుడో చిన్నప్పుడు ధన మదంతో పెత్తండ్రి చేసిన ద్రోహానికి ప్రతీకారం తీర్చుకోడానికా? సగం చచ్చిన అతన్ని నేనేం చంపుతాను? చంపి నేనేం చేసుకోను- అంతే- నాలో ఏదో కదలిక-

వెంటనే పిచ్చివాడిలా స్టేషన్ వైపు పరిగెత్తాను నా జేబులోని వందలు అతని అంతిమ సంస్కారానికి ఉపయోగించకపోతే- నేను నల్లకుక్కకన్నా నికృష్టమైన వాడితో సమానం.

రైల్వేవారితో నేనేం చెప్పానో – పక్క స్టేషన్కి ఎలా చేరానో తెలియదు. నా కళ్ల ముందు ఎదురుగా అమాయకంగా నిద్రపోతున్నట్టున్న అతని ముఖం- నా మనసు పూర్తిగా కరిగి నీరై కళ్ల వెంట ప్రవహిస్తోంది- అయితే అది ఈసారి- మానవత్వం-

రెండు అపశృతుల నుంచి ఈసారి వికృతరాగం కాదు పుట్టింది- ఒక మహారాగం బహిర్గత మైంది. □

